కథ

హక్కు

మరువాడ రాజేశ్వరరావు

ఆఫీసు దాటి వీధిలోకి అడుగు పెట్టగానే, గాలి చల్లగా తగిలింది, దూరంగా ఆకాశంలో కమ్ముకుంటున్న నల్లని మేఘాల గుంపు చూడగానే భయం వేసింది మేఘాల గుంపు అంచుల దగ్గర వెండిలాగ వెలిసి పోయింది, వెలిసిపోయిన అంచుల చుట్టూ బంగారు పూత పూసినట్టుంది. ఆ అంచులేకాక ఆకాశంవంకా నలుపెక్కి పోయేందుకు ఎంతోసేపు పట్టదనిపిస్తోంది కొద్దిసేపట్లో అంతా చీకటై పోతుంది ఉరుములు.... మెరుపులు.... వాన! తల తడిసి పోకుండా దాచుకోవాలంటే త్వరగా బస్సందుకోవాలి.

'పదగురూ....త్వరగా పద!'

పరిగెట్టినట్టు నడిచి బస్టాపు కెళ్తే పెద్ద 'క్యూ'!

క్యూలో నేనూ క్రిష్ణారావూ నిలబడ్డాం వెనకాతల క్యూ పెరిగి పోతోంది వానంటే అందరికి భయమే .... ఇరవై నాలుగ్గంటల్లో పెనుతుఫాను రాబోతుందని పొద్దున్న రేడియోలో చెప్పేరు. చెప్పిపన్నెండు గంటలేనా కాలేదు! క్యూలో అంటూ నిలబడ్డాక మనం చేసేదేమీ లేదు కదా! అటూ, యిటూ చూడ్డమే!

అటు చూస్తే కార్లు, (మనకి కాని) బస్సులు, రాబోయే వానకి భయపడుతూ పరుగులాంటి నడక నడిచే పెద్దలు, చిన్నలు, ఆడ, మగ....

ఇటు చూస్తే.... చూడాల్సిన విషయమే!

ఏదోకొత్తసినిమా.... పోస్టరు!

పైట జారిపోతుంటే కొంటెగా చూస్తూ నవ్వుతున్న హీరోయిను .... మన వేపే చూసి నవ్వుతున్నట్టుంది,

చేతికేదో చల్లగా తగిలింది....

ఛీ! ఛీ! దరిద్రం!!

వాడి మొహం నిండా చీమిడి బంక! వాడిలాగు, వొళ్ళు కూడా మురికి మురిగ్గా ఉన్నాయి. ఒక చేత్తోతుప్ప లాగున్న తల బక్కురుకుంటూ రెండో చెయ్యి ముందుకి చాచేడు.

"ఆకలేస్తుంది బాబూ"

1247

ఓ పక్క తుఫానొస్తుందని భయపడుతుంటే, మధ్యముసురులాగ వీడొకడు....

'ఆకలి వేస్తుంది ప్రతి మనిషికి ఆకలి వేస్తుంది అది ఆరోగ్య లక్షణంవే? వెళ్ళు శుభ్రింగా కావల (సింది) సినంత తిను, నాకు చెప్పడం దేనికి!'

ఇలాంటి జోకులన్నీ వేసేస్తే వాడికెలాగుంటుంది? వాడి ముష్టి చెయ్యి చూస్తే నాకూ అలాగే ఉంది. ముష్టి వెయ్యాలని పించ లేదు.

అసలెందుకు వెయ్యాలండీ?

నాదే ముష్టి బతుకు....తిండి లేదు బాబయ్యా. జీతాలు పెంచండి అని అడుక్కుంటే .. రెండురూపాయలు పెంచేరు. అందులో వీడికి వీర ముష్టా!

'లేదు ఫో' అన్నాను కాదు, కసిరేను.

వాడు పోకుండా క్రిష్ణారావు దగ్గర చెయ్యి చాచేడు....ముసురు లాగ! వాదర్దే .. బస్సు కన్న ముందు వానే వొచ్చేసే లాగుంది.

క్రిష్ణారావు, జేబులోంచి కొంత చిల్లరతీసి, అందులోవెతికి ఓరెండుపైసల బిళ్ల ఆ కుర్రాడిచేతిలో వేసేడు ... వెంటనే నావేపుతిరిగి ఓచిరునవ్వు నవ్వాడు...ఎందుకో!,

ఆ కుర్రాడు మరో అడుగు ముందుకేసేడు.

''పాపం!'' అన్నాడు క్రిష్ణారావు.

వానొచ్చేస్తే బాగుణ్ణు. వానొచ్చేసి క్రిష్ణారావు మొదలెట్టబోయే మహోపన్యాసం ఆగిపోతే...

''చూస్తే జాలేస్తోంది కదూ?''

అమ్మ బాబోయ్, క్రిష్ణారావు 'జిడ్డు!' క్రిష్ణారావు 'బంక!'... 'క్రిష్ణారావు జిగురునే వాడండి' అని ఎవరేనా ఎడ్వర్టయిజ్ చేస్తే, అతన్నెరిగిన వాళ్ళంతా కొనేస్తారని గేరంటీ యివ్వగలను.

క్రిష్ణారావు మాటకేంకాని, వానొచ్చేసేలాగుంది. మబ్బులు అంచులు మూసిపోతున్నాయి గాలి చల్లగా, వణుకులాగ తగుల్తోంది. వెలుగు కొద్దికొద్దిగా తగ్గిపోతోంది. ఈ వానలో తడవాలని రాసిపెట్టి ఉందికాబోలు! ....

క్యూలో క్రిష్ణారావుముందు ఓ పాతికేళ్ళ యువకుడు నించున్నాడు. ఎడంచేతితో ఎర్రట్ట పుస్తకం. కుడిచేతి పొడుగాటివేళ్ళమధ్య సిగరెట్టు.... అతనూ ముష్టి కుర్రాడికేంవీ యివ్వలేదు. కుర్రాడు ముందుకి నడిచేడు.

''వాడెలా బతుకుతున్నాడో? పాపం''

''ఏదో ఆలాగే బతికేస్తాడులే''

1248

—'ఇంకూరుకో' మన్నట్టుగా అన్నాను.

"అదీ బతుకేనా? చెరుకు పిప్పి చెరుకేనా? నువ్వూ నేనూ అలా బతకడాని కిష్టపడతాంవా? ....పైపెచ్చు వాడలాగేనా బతుకుతున్నందుకు నాలాంటివాళ్ళకి కోపం కూడానేమో? ..."

ముష్టి ఉపన్యాసం, వీడూను!

అయిదున్నరకే చీకటై పోతోంది.

గాలి విసురు ఎక్కువైంది. రోడ్డుమీది దుమ్ము, ధూళి, చెత్త, చెదారం గాలికి ఎగిరెగిరి, ఎగిరి పోతున్నాయి. అక్కడక్కడ దుమ్ము వలయాలు తిరుగుతూ, వింత వేషాలు వేస్తోంది.... జనం కళ్ళల్లో దుమ్ముకొడుతోంది.... నడిచేవాళ్ళ నడకల్లో ఆత్రుత ఎక్కువైంది, వానరావడం యింకెంతసేపు! ....ఈ లోగా బస్సొస్తుందా?

హీరోయిను బొమ్మవేపు మరోసారి చూసేను... పాపం, దానిగుండెలూ, దాని చూపులూ, దాని నవ్వులూ దుమ్ముకొట్టుకు పోతున్నాయి ...

"అయితే ఏఁవిటి మీరనేది?"

కృష్ణారావు ముందు నించున్నాయన సిగరెట్టుపొగ సన్నగా వదుల్తూ అన్నాడు.

"మనక్కలిగిందాన్నిబట్టీ దాన చెయ్యాలండీ! వాడితోపోలిస్తే మనఁ వెన్నిరెట్లు మెరుగ్గా బతుకుతున్నాఁవో! ... అంటే, వాడికి జరిగిన అన్యాయాన్ని మనఁవంతగా అనుభవిస్తున్నామన్నమాట ... వాడిమీద జాలిపడి సాయంచెయ్యడం మన నైతిక బాధ్యత! ... అడుక్కోవడం వాడిహక్కు!"

కృష్ణారావు వాగ్ధాటి పెరిగిపోతోంది. అతను చెప్పిందంతా విని,—

'నువ్వు దొంగవా, అమాయకుడివా?' అన్నట్టు చూసేడతను.

రవి .. కవి... అవునవును. అతనిపేరు రవి. అతను కవిత్వం రాస్తాడు. గుర్తొచ్చింది! ఎవరో, మరెవరికో అతన్ని పరిచయంచేస్తుంటే విన్నానెప్పుడో!

కృష్ణారావుతప్ప యింకెవరూ ముష్టికుర్రాడిమీద జాలిపడినట్టులేదు. పసుప్పచ్చని సిల్కుచొక్కా, మల్లువంచె తొడుక్కున్న కళ్ళజోడు పెద్దమనిషి వాడ్ని కసురుకున్నాడు.

'హక్కు'ట!

నా ముప్పైయ్యేళ్ళ జీవితంలోనూ ఎంత తరుచుగా వింటున్నానో అంతగా అర్థంకాని మాట... హక్కుఅంటే ఏఁవిటో, ఎక్కడ, ఎందుకు పుడుతుందో...

'అయిదు రూపాయల జీతం పెంచమని కోరడం మా హక్కు!' అంటూ సైనికులు.... .... అయిదూ పెంచేస్తే 'హక్కు' గెల్చేసుకున్నట్టే కద! మరో అయిదు

రూపాయలకి 'హక్కు' త్వరలోనే పుట్టేస్తుంది.... ముష్టెత్తుకోడం హక్కు ! పాని పనిచెయ్యడం హక్కు ! ఆడదానికి కళ్ళంట నీళ్లపెట్టుకునే హక్కు ! ఆడదానిమీద అధికారం— మొగవాడి హక్కు ! దేశంలోని మొగాళ్ళనందర్నీ నపుంసకుల్ని చెయ్యడం— ప్రభుత్వం హక్కు ! ప్రభుత్వానికి వోటు వెయ్యడం— ప్రజల హక్కు ! ఒక మనిషిని 'మాల'వాడ్నిచేసి, —గుడిలోకెళ్ళే హక్కు !.... ఈహక్కులు సాధించుకోడానికీ, బతుకులు బాగుపడ్డానికీ ఏఁవీ సంబంధం లేనట్టుంది.... మనకెందు కొచ్చిన గొడవ !

... పక్కనించే వెళ్ళిపోతున్న అమ్మాయి నడక... నా ఆలోచనలకి బ్రేకు !

ఆ నడకలో విసురు.... నా గుండెల్లో ఎక్కడో జివ్వున లాగింది ... గాలికి పైటచెంగు ఎగుర్తోంది....

"పైసా నఁహీఁమిలేగా ! ఏక్ థప్పడ్ మిలేగా.... ఆఁ.... హాఁ!" తల ఎగ రేస్తూ, చేతులుతిప్పుతూ అంటున్నాడో హిందుస్థానీయుడు. యజమానులంతా యిలాగే అంటారు. ఉద్యోగులు ఆ కుఱ్ఱాడిలాగే ఆకలిపొట్ట చూపిస్తూ బతిమాలుతూ ఉంటారు. ....'హక్కు !'

''హోరి కర్కోటకుడా!'' అని గొణుగుతున్నాడు కృష్ణారావు.

ఇలాంటి 'హక్కు'ల్ని క్రిష్ణారావెందుకు ప్రోత్సహిస్తాడో...? ముష్టివెయ్య డంలో మానవత్వం, అడుక్కోవడంలో న్యాయం కనిపిస్తాయతనికి.

.. చప్పుడులేకుండా వెనక్కిపడ్డాడు ముష్టికుఱ్ఱాడు. డొక్కలోతాపుతిన్న కుక్క లాగ. అచ్చు అలాగే ! అలాగరవలేదంతే.

''లంజాకొడకా ?'' అన్నాడాకార్యానికి కర్త, చాలా కోపంగా .. తడిసిన దుక్క ముక్కలాగ నల్లగా, బరువుగా కనిపిస్తున్నాడు. అలాంటివాళ్ళని చూసినప్పుడల్లా నాకు పోలీసులే గుర్తుకొస్తారు.

అట్నించి చూపులు తిప్పేసుకున్నాడు కృష్ణారావు.

''మానవత్వం'' అంటూ గొణుగుతున్నాడు, పాపం క్రిష్ణారావు !

ముష్టికుర్రాడి వేపుచూసేను. వాడికళ్ళల్లో నీళ్లనిండేయి. అప్పటికే చాలామంది 'లేదం'టూ కసిరేసేరు. ఎన్నికసుళ్లు తినగలడు ? లెఖ్ఖవేసేను. అప్పటికి రెండు పైసలకి, ఏడు కసుళ్ళుతిన్నాడు. చివర్ని ఓతాపు... ఇంకా ఎన్ని 'లేధు'లు విన్నాక మరోపైస రాల్తుందో ?...

తప్పదు. 'హక్కు'ని 'అడుక్కునే' వాడిగతి అంతే ! రోజుకో స్ట్రైకు... ఎన్నేళ్ళు!... శాంతియుతంగా స్ట్రైకులుచేసే వాళ్ళనికూడా పోలీసులు తంతారు..., ఆ దుక్కముక్కలాగే !

1250

ఆ కుర్రాడి చెయ్యి తగలగానే చొక్కా జేబు, పంట్లాం జేబూ రెండు చేతుల్తోనూ బిగించి పట్టుకుని గాభరాగా చూసేడో పరధ్యానం గాంధీటోపీ .. అందరూ నవ్వేరు.

"ఫో!... ఫో!" అని కీచుగొంతుకతో అరిచేడతను.

ఏదో వాసనచూస్తున్న ఊరకుక్క పారిపోయింది. ఆకుర్రాడు కళ్ళనీళ్ళు నింపుకుని ఇంకా అలాగే నిలబడ్డాడు.

జేబులమీంచి చేతులుతీసేస్తూ మరోసారి అరిచేడు గాంధీటోపి.

"ఓ పక్క వానొచ్చేస్తోంది. ఈ బస్సెంతకీరాదు" అన్నాడో బక్కపేగు.

గాంధీగారి 'చిరంజీవి'త్వాన్ని గురించి ఏదో చెప్తున్నాడు క్రిష్టారావు- ఆతని ముందున్నాయన... రవి!... వింటున్నాడు.

"గాంధీగారి బదులు భగత్సింగు చిరంజీవి అయితే 'హక్కు'కి వేరే అర్థం చెప్పుకునేవాళ్ళం" అన్నాడాయన.

క్రిష్టారావు ఏదో చెప్పబోతూ, ...తక్కున ఆగిపోయాడు! కొంచెం వొంగోడానికీ, ఎవరి చాటునేనా నక్కడానికీ ప్రియత్నిస్తున్నట్టనిపించింది. ఎందుకో .. రోడ్డు మీద ఎందరో తిరుగుతున్నారు. ఎవర్నిచూసి భయపడుతున్నాడో అర్థంకాలేదు.

కాసేపయేక నిఠారుగా నిలబడ్డాడు మళ్ళీ...

యుద్ధభేరీలు వాయిస్తున్నట్టు ఉరిమింది ఆకాశం! మేఘాల్లో మెరుపు మెరిసింది. కాసేపు కళ్ళు చీకట్లుకమ్మేయి. కొంచెం తెరిపిచిక్కేక, కృష్ణారావు రోడ్డుమీద ఎవర్నో చూపిస్తున్నాడు.

అతను నల్లగా ఉన్నాడు పొడుగ్గా ఉన్నాడు. బలంగా ఉన్నాడు. ఠీవిగా, నిర్భయంగా నడుస్తున్నాడు, వానొస్తుందనే భయంలేనట్టు నడుస్తున్నాడు. భయపడే వాళ్ళు భయపడండి అన్నట్టు యిటూ, అటూ చూస్తూనడుస్తున్నాడు.

మేఘాల అడవుల్లో మరో మెరుపు మెరిసింది. బాంబులు పేల్తున్నట్టు ఉరుములు.

"అతన్నిచూచి నువ్వు దాక్కోవడం దేనికి?" అన్నాను.

"వాడు నాకుతెలుసు"

తెలిస్తే ?...

"చాలా డేంజరస్"

చూడ్డానికలాక్కనిపించడం లేదుమరి!

"విప్లవం కావాలంటాడు...అబ్బే! నాకిప్పుడతన్తో ఏ సంబంధమూ లేదనుకో!... పియ్యూసీవరకూ నాక్లాస్‌మేట్, ఈ మధ్యనే విన్నాను... అతను విప్లవం కావాలంటు

1251

న్నాడు... అంటున్నాట్ట! నాకు సరిగ్గా తెలీదనుకో... అయినా, చూస్తే పలకరిస్తాడని... నేనోసారి విన్నానులే. కూలివాళ్ళ మీటింగులో మాట్లాడుతూ, 'కేవలం ప్రాణాలతో కాక, మనుషుల్లా బతికే హక్కు సాధించుకోండి', అన్నాడు. అంతటితో ఊరు కున్నాడా? 'అందుకు అడ్డుతగిలేవాళ్ళ ప్రాణాలుతీసినా తప్పులే'దన్నాడు... అమ్మో, మనకెందుకులే వాడితో అని!..."

కృష్ణారావు కొంచెం వొణుకుతున్నట్టు నాకనుమానం,

"అయితే నీకెందుకుభయం? నీ ప్రాణాల్తీసేడు కదా?"

"అబ్బే! అతనుకాదు. పోలీసులు చూసేవూ?... చాలా ప్రమాదం...యిలాంటి వాళ్ళని ఎక్కడో అడవుల్లోకి తీసుకుపోయి కాల్చేస్తారట! .. నాకు పరిచయం ఉందని తెలిస్తే..." పెర్యస్గా నవ్వేడు క్రిష్ణారావు.

కొండల్లాంటి మేఘాలు ఉరుములతో అదిరిపోతున్నాయి. విసురుగా వీస్తున్న గాలి... రోడ్డుమీది దుమ్మునీ ధూళినీ తుడిచిపెట్టేస్తుంది. ప్రళయంలాగ... తుఫా నొచ్చేస్తోంది.

"మనుషుల్లా బతికే హక్కు!...

కృష్ణారావు, హక్కుల్నీ హక్కుదారుల్నీ సమర్థిస్తాడే! మరి ఈ హక్కు ...ఇదంటే భయపడుతున్నాడు. ఈ హక్కుదారుల్ని... పోలీసులు కాల్చేస్తారంటు న్నాడు. హక్కంటే?... ముష్టి?... పోరాటం!

"హక్కంటే ఏఁవిటోయ్, క్రిష్ణారావ్?"

"ఆఁ, అదే! దాని గురించే చెప్పబోతున్నాను మేష్టారు..."

కృష్ణారావు ముందునుంచున్నాయన... రవి. ఏదో చెప్తుంటే,.

మరో మెరుపు...

టపటపా చినుకులు రాలేయి.

బస్సు రాకుండానే వానొచ్చేసింది.

కృష్ణారావు, రెండుచేతులూ నెత్తిమీద పెట్టుకుని నావేపుగా భరాగా చూసేడు.

వాన పెద్దదైపోతోంది. తలదాచుకోడానికి అందరూ అటూ, యిటూ పరిగెడు తున్నారు. కృష్ణారావు గాభరాగా ఎటో పరిగెడుతూ... దారిలో చూసుకోకుండా ముష్టి కుర్రాడ్ని గుద్దుకున్నాడు. వెల్లకిలా పడిపోయిన ముష్టి కుర్రాడ్ని... ఆ గాభరాలో మట్టీసుకుంటూ పరిగెట్టేడు క్రిష్ణారావు... ఆ క్షణంలో అతనికి మానవత్వంకన్నా, తల దాచుకోడఁవే ముఖ్యమైపోయింది!

పరిగెట్టడంవేగాని, కనుచూపుమేరలో, ఎక్కడా తలదాచుకోవడం సాధ్యపడదని తెలుసుకొనక వానలోతడుస్తూ అలాగే నిలబడిపోయేను. క్యూలో రవీ, నేనూ మిగిలేం.

"నేచెప్తున్న దేంవిటంటే .."

వరదొచ్చినా, తుఫానొచ్చినా తను చెప్పదల్చుకున్నది చెప్పేతీరుతానన్నట్టున్నాడతను

హక్కు గురించండి!.... హక్కంటే ఏంవిటి? మనకి న్యాయంగా రావలసిందాన్ని హక్కంటాం. మనకి న్యాయంగా చెందవలసిందాన్ని అన్యాయంగా దోచుకుని యింకొకడనుభవిస్తుంటే, 'బాబ్బాబు, మాది మాకిచ్చిరా' అని బతిమాలితే యిచ్చేస్తాడండీ? యివ్వడానికా వాడు దోచుకున్నాడు? కావలిస్తే ముష్టెత్తుకోమంటాడు. మనం ముష్టెత్తు కోడానికొప్పేసుకుంటే, వాడి అన్యాయం న్యాయంవై పోతుంది. అందుకే ముష్టి వేస్తానంటాడు వాడు. మనకి ముష్టెత్తుకునే ఖర్మేంవిటండీ? మీ జేబులోంచెవడేనా పది రూపాయలు కొట్టేసి మీకు పది పైసలు దానం చేస్తానంటే ఒప్పేసుకుంటారా చెప్పండి? మీ పది రూపాయలూ వాడ్ని తన్ని లాక్కోడంవే కాకుండా, దొంగ పని చేసినందుకు వాడ్ని శిక్షించాలంటారు, అవునా, కాదా? అంటే దగుల్బాజీ వాణ్ని తన్నాలిగాని, బతిమాలకూడదు, మరి ఈ సంపదలూ, ధాన్యాలూ, మేడలూ, వాహనాలూ రోడ్లూ యివన్నీ జనం కష్టపడి పనిచేస్తే వొచ్చేయా? లేక, వాడెవడో రూపాయి నోట్ల వర్షం కురిపిస్తే వొచ్చేయా? అయితే కష్టపడే వాడెక్కడున్నాడండి? రోగాల్లోనూ, రొచ్చులోనూ, బురదలోనూ, దరిద్రింలోనూ కూరుకుపోయి ఉన్నాడు, రూపాయల వర్షం కురిపించినవాడో? మేడల్లోను, కార్లలోను, కులాసాల్లోను ఖుషీగా ఉన్నాడు, కష్ట పడ్డవాళ్ళ కడుపులు నిండడానికీ, మేడల్లో వాళ్ళని కిందకి దించడానికీ ఏం చెయ్యాలండీ? ముష్టెత్తాలా? కత్తులు నూరాలా? కత్తులు నూరాలండీ! తుపాకులు, బాంబులు పట్టుకోవాలి. భగత్సింగ్ ముష్టెత్తాడా? తుపాకి పట్టుకొన్నాడు. గాంధీ ముష్టెత్తి సంపాయించిన స్వాతంత్ర్యం ముష్టి స్వాతంత్ర్యంలాగే ఉంది...యిందాక వెళ్ళినాయన,... ఎవరో తెలుసా? క్రిష్ణారావుకి పరిచయం ఉందికాని, అతని గురించేంనీ తెలీదు. నాకతన్తో పరిచయం లేదు, అయినా, అతన్ని గురించి నాకు తెలిసింది చెప్తాను వినండి.. అతను నిప్పులాంటి వాడండీ! నిప్పులాగ మండుతున్నవాడు నిప్పులాగ జనాన్ని మంచిస్తున్నవాడు నిప్పులాగ శత్రువుని కాలుస్తాడు, ఉన్న ఉద్యోగాన్ని, పెళ్ళాం పిల్లల్నీ, తల్లి దండ్రుల్ని సుఖాన్ని వొదులుకొని జనం మధ్యకి వెళ్ళిపోయేడండీ! ప్రాణాలకి తెగించి వెళ్ళిపోయేడు, ఎందుకు? ముక్కు మూసుకుని జపం చేయడానికాదు. స్వర్గం కోసంవూ స్వర్గంలో రంభ కోసంవూ కాదు. జనంతో కలసి, అన్యాయాన్ని ఎదిరించడానికి వెళ్ళేడు. జనాన్ని బతుకు వెలుగులోకి పోరాటంద్వారా

1253

నడిపించడానికి వెళ్ళి పోయేడు. జనానికేదో సేవ చేద్దామనా, ఏదో త్యాగం చేస్తున్నా ననుకునా కాదు. అతని జీవితానుభవంలోంచి, జీవితాన్నితను అర్థంచేసుకున్న తీరుని బట్టీ ఆంతరాంతరాల్లో తోచిన అవసరంవల్ల వెళ్ళేడు. హక్కుని అర్థం చేసుకున్నాడు కనక, పోరాటం ద్వారానే ఆ హక్కుని సాధించుకోవలసిన అవసరం తెలిసింది కనక వెళ్ళేడు, అతను సాధిస్తాడండీ! జనం అతని వెంట నడిచి, సాధించుకుంటారు!"

అతని ఉపన్యాసం వింటున్నంతసేపూ వానపడుతున్నా, చలివెయ్యలేదు.

అల్లంత దూరంలో రోడ్డుకొసాని,—

గాలినీ, వర్షాన్నీ చీల్చుకుంటూ, దూరంగా వొంగిన ఆకాశంలోకి...
ఆకాశంలోని మేఘాల కొండల్లోకి... అదృశ్యమైపోయేడు, 'అతను!'

అక్కడో మెరుపు మెరిసింది.

జనవరి సంచిక కథల సంచిక

విప్లవకథ కొన్ని సమస్యలు, సూచనలు, ఆలోచనలు :

కొడవటిగంటి కుటుంబరావు, కృష్ణాబాయి, మరువాడ రాజేశ్వరరావు

నర్తోడు కథ శ్రీపతి

కథల్లో యిపుడు వీస్తున్న న్యూవేవ్ సమీక్ష

1254